

ఇన్నోవేటర్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులు

## ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు పంపాలి

- వాట్సాప్ ద్వారా వివరాలు చేరవేయండి: కలెక్టర్ అనురాగ్

కలెక్టరేట్, జూలై 19: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో పాల్గొనేవారు తమ వివరాలను ఆగస్టు 5వరకు పంపాలని కలెక్టర్ అనురాగ్‌జయంతి సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఇంటింటా ఇన్నోవేటర్-2023కి సంబంధించి పోస్టర్‌ను జిల్లా పరిశ్రమలశాఖ అధికారి ఉపేందర్‌రావు, డీపీఆర్‌వో ఎం దశరథం, ఈడీఎం శ్రీనివాస్, ఎల్‌డీఎం మల్లికార్జున్‌తో కలిసి ఆవిష్కరించి, మాట్లాడారు. ఔత్సాహికులు తమ ప్రతిభను చాటుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఐదేండ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని తెలిపారు. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శనను నిర్వహిస్తున్నాయని, ఈ ప్రదర్శన జిల్లా స్థాయిలో వేడుకల్లో భాగంగా ఉంటుందని తెలిపారు. గ్రామీణ, విద్యార్థుల, వ్యవసాయరంగ, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలు స్వీకరిస్తామని తెలిపారు. ఆవిష్కరణకు సంబంధించి 6 వాక్యాలు, 2 నిమిషాల వీడియోను, ఆవిష్కరణకు సంబంధించి నాలుగు ఫొటోలు, ఆవిష్కర్త పేరు, ఫోన్ నెంబర్, వయసు, ప్రస్తుత వృత్తి, గ్రామం పేరు, జిల్లా పేరు తదితర వివరాలను వాట్సాప్ (91006-78543) చేయాలన్నారు. మొదటి షార్ట్‌లిస్ట్ తర్వాత ఐదు ఆవిష్కరణలు ప్రదర్శనకు ఎంపిక చేస్తామని తెలిపారు.

## నిమ్మపల్లి మూలవాగుకు జలకళ



నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టులోకి వస్తున్న వరద

కోనరావుపేట, జూలై 19: మండలంలోని నిమ్మపల్లి మూలవాగు ప్రాజెక్టుకు వరద నీరు చేరుతున్నది. రెండు రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో వరద వస్తుండగా, ప్రాజెక్టు జలకళను సంతరించుకున్నది. ప్రాజెక్టు సామర్థ్యం 19అడుగులు కాగా, ప్రస్తుతం 6అడుగుల మేర వరద చేరింది. నీటిమట్టం ఇంకా పెరుగనున్నదని అధికారులు వెల్లడించారు. అలాగే కొండాపూర్‌లో పెంటివాగు ప్రవాహం కొనసాగుతున్నది. వెంకట్రావుపేట, కొండాపూర్ సమీపంలోని మూలవాగుకు వరద వస్తున్నది.

## రైతులకు వెన్నుదన్నుగా ఉండడమే లక్ష్యం

- ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి



ఏఎంసీ కార్యాలయంలో మాట్లాడుతున్న చైర్మన్ సత్యనారాయణరెడ్డి

బోయినపల్లి, జూలై 19: రైతులకు వెన్నుదన్నుగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని ఏఎంసీ చైర్మన్ లెంకల సత్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. బుధవారం బోయినపల్లిలోని కార్యాలయంలో నిర్వహించిన పాలకవర్గ సమావేశంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. సీఎం కేసీఆర్ రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని తెలిపారు. మిషన్‌కాకతీయ, రైతుబంధు, రైతుబీమా, ప్రాజెక్టుల నిర్మాణంతో సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. గతంలో నిరుపయోగంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీలు ప్రస్తుతం అందుబాటులోకి తీసుకొచ్చారని కొనియాడారు. అన్ని వ్యవసాయ మార్కెట్లలో అన్నిరకాల పంటలు కొనుగోలు చేసి, నిల్వ పెట్టుకునే సౌకర్యం కల్పించారన్నారు. ఈ క్రమంలో రైతుల అభ్యున్నతి కోసం పలు తీర్మానాలు చేశారు. సమావేశంలో బోయినపల్లి సర్పంచ్ గుంటి లత్మశ్రీ, ఏఎంసీ డైరెక్టర్లు జంపుక మాధవి, కొప్పుల మల్లేశం, జంగ సత్యం, కన్నం సాగర్, కస్తూరి బాపురెడ్డి, గుడి శ్రీనివాసరెడ్డి, పోలె కొమురయ్య, చిందం వేణు, ఇన్‌చార్జి కార్యదర్శి రాజేందర్ తదితరులు ఉన్నారు.

# 'ముసురు'కుంది

- జిల్లా వ్యాప్తంగా వర్షం ● మత్తడి దుంకుతున్న చెరువులు ● జోరందుకున్న సాగు పనులు



వీర్నపల్లి: మత్తడి దుంకుతున్న గర్జనపల్లి మూలవాగు

*జిల్లా వ్యాప్తంగా ముసురుకున్నది. సోమవారం అర్ధరాత్రి మొదలైన వాన బుధవారం రాత్రి వరకు కురిసింది. ముసురు పడడంతో వాహనదారులు, చిరువ్యాపారులు, పాదచారులు ఇబ్బందిపడ్డారు. మొన్నటిదాకా దంచికొట్టిన ఎండలతో అల్లాడిన ప్రజలు, రెండు మూడు రోజుల నుంచి పడుతున్న ముసురుతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో సాగు పనులు జోరందుకున్నాయి.*

*-వేములవాడ/బోయినపల్లి/వీర్నపల్లి/కోనరావుపేట/ఇల్లంతకుంట, జూలై 19*

జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల నుంచి వర్షం పడుతున్నది. బోయినపల్లి మండలంలో ఎడతెరిపి లేకుండా ముసురు పడడంతో వ్యవసాయ పనులు నిలిచి పోయాయి. గ్రామాల్లోని రహదారులు బురదమయం కాగా, పనుల నిమిత్తం బయటకు వెళ్లినవారు ఇబ్బందిపడ్డారు.

- కోనరావుపేట మండల వ్యాప్తంగా ముసురు పడింది. పంటచేలలో నీరు చేరింది. ఈ క్రమంలో పత్తి పంటలో పనులు సాగకపోగా, వరి నాట్లలో రైతులు బిజీ అయ్యారు. పలు చోట్ల కుంటలు, ఒర్రెలు ఉధృతంగా ప్రవహించాయి.
- ఇల్లంతకుంట మండల కేంద్రంతోపాటు రహీంఖాన్‌పేటలో భారీ వర్షం కురుస్తుంది. ఈ క్రమంలో రైతులు సంతోషం వ్యక్తం చేసి, సాగు పనుల్లో బిజీగా మారారు. కాగా, వాహనదారులు కొంత ఇబ్బందిపడ్డారు.
- వేములవాడ పట్టణంలో మోస్తారుకు మించి వర్షం కురిసింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు వర్షం కురువగా, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఐదు సెంటీమీటర్ల వర్షపాతం నమోదు గణాంకాకారి రమణ తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన తర్వాత వేములవాడ పరిధిలో ఇప్పటివరకు 10సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాతావరణం చల్లపడడమే కాకుండా వ్యవసాయ పనుల్లో రైతులు బిజీగా మారారు.
- వీర్నపల్లి మండలంలోని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఎగువ నుంచి వరద వచ్చి చేరుతుండడంతో మద్దిమల్ల, రాయినిచెరువు, అడవిపదిర, ధర్మారం చెరువుల్లో నీటిమట్టం పెరిగింది గర్జనపల్లి మూలవాగు ఉధృతి పెరగడంతో మత్తడి దుంకుతున్నది. వర్షాలు అధికమైతే రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని, ముందస్తుగానే మారుమూల ప్రాంతాల్లో ఉన్న గర్భిణులను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకుతరలించాలని తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్ సూచించారు. గ్రామాల్లో ప్రాణ, ఆస్తి నష్టం జరిగితే కార్యాలయానికి సమాచారం అందించాలని కోరారు.

## అప్రమత్తంగా ఉండాలి

**టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనురాగ్ జయంతి**

కలెక్టరేట్, జూలై 19: జిల్లాలో భారీ వర్షాల దృష్ట్యా అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ అనురాగ్‌జయంతి ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం అధికారులతో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో మూడు రోజులపాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణశాఖ తెలిపిందన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. గ్రామ పరిధిలో పురాతన, శిథిల భవనాలు, గోడలు కూలే పరిస్థితులు ఉంటే, వాటిని గుర్తించి నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. మానేరు, మూలవాగు, నక్కవాగు, ఇతర వాగుల వద్దకు ప్రజలు వెళ్లకుండా అప్రమత్తం చేయాలన్నారు. చెరువులు, ప్రాజెక్టుల కాలువల్లో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆదేశించారు. చెరువులు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో ఫోన్ చేసేందుకు ప్రతి గ్రామ పరిధిలో వాట్సాప్ గ్రూపులలో అధికారుల ఫోన్ నంబర్లను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. జిల్లాలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలన్నారు. కీటకజనిత వ్యాధులు ప్రబలకుండా ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రై డే పాటించాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు బీ సత్యప్రసాద్, ఎన్ ఖీమ్యానాయక్, ఆర్డీవోలు టీ శ్రీనివాసరావు, పవన్‌కుమార్, ఆయా శాఖల అధికారులు, తహసీల్దార్లు, డీపీవో రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



వేములవాడ: పట్టణంలో కురుస్తున్న వర్షం



వేములవాడ పట్టణంలోని జూనియర్ కళాశాల గ్రౌండ్ మైదానంలో నిలిచిన నీరు



వర్షంలో బైక్‌పై వెళ్తున్న వాహనదారులు

## వీధికుక్కల బీభత్సం

- 28మందిపై దాడి

వేములవాడ, జూలై 19: పట్టణంలో బుధవారం వీధికుక్కలు బీభత్సం సృష్టించాయి. ఆదర్శ పాఠశాల నుంచి మొదలుకొని సుభాష్‌నగర్, ఉప్పుగడ్డ వీధి, ప్రధాన ఆలయం రహదారి గాంధీనగర్ వరకు మూడు కుక్కలు 28మందిపై దాడి చేశాయి. ఏరియా దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులను కౌన్సిలర్ నరాల శేఖర్ పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని ఆయన వైద్య సిబ్బందికి సూచించారు.

## ఆర్థిక సాయం అందజేత

చందుర్తి (రుద్రంగి), జూలై 19: చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన పొలాస దేవేంద్ర కూతురు-అల్లుడు కొద్ది రోజుల క్రితం మృతి చెందారు. కాగా, వీరికి ఇద్దరు కవలలు (వివేక్, సిద్ధార్థ్) ఉన్నారు. ప్రస్తుతం ఇద్దరు చిన్నారులను అమ్మమ్మ దేవేంద్ర అన్ని తానే పెంచింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు చల్మెడ లక్ష్మీనరసింహరావు బుధవారం బాధిత కుటుంబానికి పరామర్శించి, రూ.10వేలు అందించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సాయం చేసిన చల్మెడ లక్ష్మీనరసింహారావుకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ సొసైటీ చైర్మన్ జలగం కిషన్‌రావు, తదితరులు ఉన్నారు.



బాధిత కుటుంబానికి నగదు అందిస్తున్న లక్ష్మీనరసింహారావు

## చిన్నారులకు మాత్రలు వేయించాలి

కోనరావుపేట, జూలై 19: నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏండ్ల వయసు కలిగిన చిన్నారులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని వైద్యాధికారి వేణుమాధవ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, సబ్‌సెంటర్లలో కేంద్రాలు ఏర్పాటు చేసి 45మంది ఆశ కార్యకర్తలు, 13మంది ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఎంపీపీ చంద్రయ్యగౌడ్ ప్రారంభించనున్నట్లు తెలిపారు.

## బాధిత కుటుంబానికి సాయం



మల్లేశం కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న నాయకులు

రుద్రంగి, జూలై 19: మండల కేంద్రానికి చెందిన కురుమ మల్లేశం రెండు నెలల క్రితం మస్కట్‌లో మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని రాష్ట్ర కురుమ యువ చైతన్య సమితి, కేవైసీఎస్ గల్ఫ్‌శాఖ ఆధ్వర్యంలో నాయకులు బుధవారం పరామర్శించారు. వారివంతుగా రూ.45వేలు అందించారు. ఇక్కడ రాష్ట్ర కురుమ యువ చైతన్య సమితి ప్రెసిడెంట్ మహేందర్, కేవైసీఎస్ కరీంనగర్ జిల్లా నేతలు శ్రీనివాస్, శ్రీహరి, రాజయ్య ఉన్నారు.